సాక్షి తిరుపతి

గురువారం । 8 । జూన్ । 2023



శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమలవేంకటేశ్వరస్వామివారిని బుధవారం పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు దర్శించుకున్నారు. - 8లో



వేసవిలో వన్యప్రాణులకు అండగా..

వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అడవుల్లో నీటి వనరులను అందుబాటులోకి తీసుకువచ్చింది. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	41	28
చిత్తూరు	39	28
తిరుమల	36	24
గూడూరు	42	31
నగరి	41	29

న్యూస్‌రీల్

పకడ్బందీగా గ్రూప్-1 పరీక్షలు



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్ : గ్రూప్-2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. బుధవారం తిరుపతిలోని ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రూప్-1 పరీక్షలు ఈ నెల 10వ తేదీ వరకు కొనసాగనున్నట్లు వెల్లడించారు. ప్రతి రోజూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతున్నట్లు చెప్పారు. పరీక్షలకు మొత్తం 577 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా, ఈ నెల 3వ తేదీన 439 మంది, 5న 434 మంది, 6న 434 మంది, 7న 429 మంది హాజరైనట్లు వివరించారు. కలెక్టర్ వెంట ఎస్‌డీసీ శ్రీనివాసులు, పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ సుమకిరణ్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ మణి ఉన్నారు.

అంగన్‌వాడీల్లో అద్భుతంగా వసతులు



జయలక్ష్మి, జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖాధికారి

తిరుపతి అర్బన్ : జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అద్భుతంగా వసతులు కల్పించినట్లు మహిళా శిశు సంక్షేమ శాఖాధికారి జయలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ నాడు-నేడు కింద అంగన్‌వాడీలను ఉన్నతంగా తీర్చిదిద్దామన్నారు. బడి బయట పిల్లను బడిలో చేర్పించేందుకు అంగన్‌వాడీ ఉద్యోగులు పనిచేయాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలోని మొత్తం 2,692 అంగన్‌వాడీ కేంద్రాల్లో మొత్తం 1,05,547 మంది పిల్లలున్నారని వివరించారు. వీరికి వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కింద పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. కొత్తగా 65 శాటిలైట్స్ అంగన్‌వాడీ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. 40 ఫౌండేషన్ స్కూల్స్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు వెల్లడించారు. మరోవైపు 155 స్కూల్స్‌కు మరమ్మతులు చేయిస్తున్నట్లు వివరించారు. ఈ క్రమంలోనే 14,264 మంది గర్భిణులు, 12,978 మంది బాలింతలకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు.

ఆనందం.. 'శాశ్వతం'



రాజకీయాల్లో నాయకులు వస్తుంటారు.. పోతుంటారు. కొందరే విలువలతో కూడిన రాజకీయాలు చేస్తుంటారు.. నిబద్ధతతో హామీలు ఇస్తుంటారు.. వాటిని నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తుంటారు.. దిగ్గజ నేతలుగా చరిత్రలో మిగిలిపోతుంటారు. అలాంటి మహానాయకులు చూపిన బాటలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పయనిస్తున్నారు. ఇచ్చిన మాటను తప్పకుండా.. వెనకడుగు వేయకుండా సంక్షేమ పాలన సాగిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం నిర్వహించిన కేబినెట్ సమావేశంలో మరో అడుగు ముందుకు వేశారు. ఒప్పందం పేరుతో చిన్నబోయిన ఉద్యోగులను క్రమబద్ధీకరించి వారిలో నూతనోత్తేజం నింపారు. సీపీఎస్ పేరిట తల్లడిల్లుతున్న ప్రభుత్వోద్యోగులకు జీపీఎస్ ప్రకటించి వారి జీవితాల్లో వెలుగులు తీసుకువచ్చారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఒకే నినాదం మార్మోగుతోంది. మాటిస్తే.. తప్పడంతే అంటూ ప్రజల్లో హర్షాతిరేకం వ్యక్తమవుతోంది.



- హామీల అమలులో సీఎం జగన్ మరో ముందడుగు
- కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణకు గ్రీన్‌సిగ్నల్
- సీపీఎస్ రద్దు చేస్తూ నిర్ణయం
- పాత పింఛన్‌కు సమానంగా ఏపీ జీపీఎస్
- హెచ్‌ఆర్‌ఏ పెంపుపై ఉద్యోగుల హర్షం

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్ట్ ఎంప్లాయీస్‌కి వైఎస్సార్‌సీపీ సర్కార్ తీపి కబురు వినిపించింది. ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్న ఒప్పంద ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మొత్తం 1,998 మంది కాంట్రాక్ట్ ఉద్యోగుల కల నెరవేర్చింది. ఈ మేరకు ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ సిబ్బందికి రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా అన్ని సదుపాయాలను వర్తించనున్నారు. అలాగే పాత పింఛన్‌కు సమానంగా ఉండేలా గ్యారెంటీ పెన్షన్ స్కీమ్‌ను అమలు చేసేందుకు మంత్రి వర్గం ఆమోదం లభించింది. జిల్లాలోని మొత్తం 44,377 మంది ఉద్యోగులకు అరియర్స్‌తో 2.73 శాతం డీఏ వర్తింపజేయనుంది. అలాగే జిల్లా కేంద్రాల్లో పనిచేసే ఉద్యోగులకు 12 శాతం నుంచి 16 శాతం హెచ్‌ఆర్‌ఏ పెంచడంతో చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని దాదాపు 12 వేలకు పైగా ఉద్యోగులకు మేలు చేకూరుస్తోంది.

రుణపడి ఉంటాం

ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాం. 2008 నుంచి 2010 వరకు కర్నూలు, 2011 నుంచి ఇప్పటి వరకు ఏర్పేడు మండలంలోని పాపానాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కామర్స్ అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్నా. 15 ఏళ్లుగా ఎన్ని ప్రభుత్వాలు మారినా మా వైపు కన్నెత్తి చూడలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక రెగ్యులరైజ్ చేస్తుండడం సంతోషంగా ఉంది. ఏళ్ల తరబడి మా కల నేడు సాకారమవుతోంది.



– శంకర్, అధ్యాపకుడు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాపానాయుడుపేట

జగనన్న రుణం తీర్చుకోలేం



కాంట్రాక్ట్ ఉద్యోగుల పట్ల సీఎం జగనన్న తీసుకున్న నిర్ణయం మా బతుకుల్లో వెలుగులు నింపింది. కాంట్రాక్ట్ ఉద్యోగులు గానే రిటైర్డ్ అవుతామనుకున్నాం. అలాంటిది శాశ్వత ఉద్యోగులుగా అవకాశం కల్పించిన జగనన్న రుణం తీర్చుకోం. మనసున్న మహారాజు అని మరోసారి రుజువైంది. ప్రజలతో పాటు ఉద్యోగులకు సైతం జగనన్న ప్రభుత్వంతోనే మంచి జరుగుతుంది.

– ఎం.రాజేశ్వరి, హెల్త్ అసిస్టెంట్, మంగళం

సువర్ణాధ్యాయం



ఏదో ఒక రోజు పర్మినెంట్ అవుతామన్న ఆశతో 23ఏళ్లుగా కాంట్రాక్ట్ ప్రాతిపదికన జూనియర్ లెక్చరర్‌గా పనిచేస్తున్నా. గత టీడీపీ హయాంలో కమిటీలు వేసి కాలయాపన చేశారు. రెగ్యులరైజ్ చేస్తామని నమ్మించి మోసగించారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చెప్పిన మాటకు కట్టుబడి కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడం చరిత్రలో సువర్ణాధ్యాయం. కాంట్రాక్ట్ ఉద్యోగులందరూ ఎప్పటికీ ముఖ్యమంత్రికి కృతజ్ఞతగా ఉంటాం

– వి.చంద్రప్ప, ప్రధాన కార్యదర్శి, జిల్లా కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్ల సంఘం

జగనన్నకే ఘనత



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్యోగుల పక్షపాతి అని నిరూపించుకున్నారు. ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. చారిత్రాత్మక ఘనత జగనన్నకే దక్కుతుంది. గతంలో చంద్రబాబు టైం స్కేల్ విధానాన్ని రద్దుచేసి కాంట్రాక్ట్ ఉద్యోగుల కడుపుకొట్టాడు. 21 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో వెట్టిచాకిరీ చేశాం. ఇన్నాళ్లకు న్యాయం జరిగింది.

– జి.తులసీరామ్, ల్యాబ్ టెక్నీషియన్, తిరుపతి

నిరీక్షణకు తెర



గత 19 ఏళ్లుగా తక్కువ వేతనాలతో పనిచేశాం. జగనన్న ప్రభుత్వం మా నిరీక్షణకు తెరదించింది. ప్రభుత్వంపై ఉద్యోగులకు మరింత విశ్వాసం పెరిగింది. కాంట్రాక్టర్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ తో మిగిలినవారికి దారి ఏర్పడింది. దశలవారీగా ఈ ప్రక్రియ కొనసాగుతుందని విశ్వసిస్తున్నాం. బానిస సంకెళ్లను తెంచిన ధీరుడిగా జగనన్న చరిత్రలో నిలిచిపోతారు.

– కె.అమర్‌నాథ్, ల్యాబ్ టెక్నీషియన్, ప్రసూతి ఆస్పత్రి, తిరుపతి

చారిత్రాత్మక నిర్ణయం



కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ జగనన్న చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. మాట తప్పడు.. మడమ తిప్పడు అన్న జగనన్న నినాదం మరింత విశ్వాసంగా మారింది. గత ప్రభుత్వం కన్సాల్డేటెడ్ పే విధానాన్ని తీసుకువచ్చి మాకొంప ముంచింది. జగనన్న నిర్ణయంతో వేలాది కుటుంబాల్లో వెలుగులు నిండాయి. గతంలో మెటర్నిటీ లీవులు ఉండేవి కావు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆ వెసులుబాటును కల్పించారు.

– ఎస్.శారద, ఈసీజీ టెక్నీషియన్, తిరుపతి

జీపీఎస్ అమలు హర్షణీయం



సీపీఎస్ స్థానంలో జీపీఎస్ తీసుకురావడం హర్షణీయం. ఒకట్రెండు అంశాలు మినహా ఓపీఎస్‌కు సమానంగానే జీపీఎస్ ఉంది. జీపీఎస్ వలన పదవీ విరమణానంతరం ఓపీఎస్‌తో సమానంగానే లబ్ధి చేకూరుతుంది. అయినప్పటికీ ఓపీఎస్ అమలుపై ప్రభుత్వం పునరాలోచించాలని విన్నపం.

– ఏఎం గిరిప్రసాద్, రాష్ట్ర అధ్యక్షుడు, పీఆర్‌టీయూ

శుభపరిణామం



ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్ట్ ఉద్యోగుల విషయంలో ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం శుభపరిణామం. ఇచ్చిన హామీల్లో వంద శాతం నెరవేర్చారనడానికి ఇదో నిదర్శనం. జగనన్న అధికారంలోకి వచ్చాక లక్షలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. కాంట్రాక్ట్ సిబ్బందికి సైతం ఉద్యోగ భద్రత కల్పించిన ఘనత జగనన్నకే దక్కుతుంది. 2024లో అన్ని వర్గాల ప్రజలు జగనన్నకే మద్దతుగా నిలుస్తారు.

– మురళీరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు, వైఎస్సార్ ఎంప్లాయీస్ యూనివర్సిటీ ఫెడరేషన్

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



పర్మినెంట్ చేస్తారన్న ఆశతో ఏళ్ల తరబడి ఎదురుచూసిన మాకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 2014, జూన్ 2 లోపు ఐదేళ్లు పూర్తి చేసుకున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తూ తీసుకున్న నిర్ణయంతో రాష్ట్రంలో దాదాపు 11వేల మంది లబ్ధి పొందనున్నారు. మిలిగిన వారిని రెగ్యులరైజ్ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం. మా కష్టాలను గుర్తించి మమ్మల్ని రెగ్యులరైజ్ చేసిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు.

– కె.రెడ్డప్పరెడ్డి, అధ్యక్షుడు, జిల్లా కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్ల సంఘం

సీపీఎస్ రద్దు హర్షణీయం



సీపీఎస్ రద్దు చేయడం ఆనందంగా ఉంది. జీపీఎస్‌తో ఉద్యోగులకు మేలు చేకూరుతుంది. కాంట్రాక్ట్ ఎంప్లాయీస్‌ను రెగ్యులరైజ్ చేయడం మంచి విషయం. దీంతో వేలాది మందికి లబ్ధి కలుగుతుంది. పెండింగ్ డీఏ, 12వ పీఆర్సీ తదితర అంశాలపై అన్ని వర్గాల్లో సానుకూలత వ్యక్తమవుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అభినందనలు.

– శాంతిదుర్గ, సీడీపీఓ, ఏపీ ఎంప్లాయీస్ సంఘం శ్రీకాళహస్తి అధ్యక్షులు

మా పాలిట దైవం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కాంట్రాక్ట్ ఉద్యోగుల పాలిట దైవంగా భావిస్తున్నాం. ఏళ్ల తరబడి తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలలో టెక్నీషియన్ పనిచేస్తున్నా. రెగ్యులరైజ్ చేయాలని గత ప్రభుత్వాన్ని ఎన్నో సార్లు డిమాండ్ చేశాం. అయినా ప్రయోజనం లేదు. చిరు ఉద్యోగుల కష్టాన్ని గుర్తించిన జగనన్న మాకు న్యాయం చేశారు. ఆయనకు ఎప్పుడూ రుణపడి ఉంటాం. ఎంతో సంతోషంగా ఉంది.

– పి. బిల్వకుమారి, ల్యాబ్ టెక్నీషియన్, ఎస్వీ మెడికల్ కళాశాల, తిరుపతి

ఆనందంగా ఉంది



జీవితంలో ఇక పర్మినెంట్ అవుతామనే ఆశను వదులుకున్నాం. ఈ తరుణంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అద్భుత నిర్ణయం తీసుకున్నారు. మా కష్టాన్ని గుర్తించి రెగ్యులరైజ్ చేయడం ఆనందంగా ఉంది. గత పాలకులు హామీలు ఇచ్చారే తప్ప అమలు చేయలేదు. అయితే జగనన్న ఇచ్చిన హామీని నెరవేర్చారు. ఆయనకు రుణపడి ఉంటాం.

– వి.మధుసూదన్, ఫొటో ఆర్టిస్ట్, ఎస్వీ మెడికల్ కళాశాల, తిరుపతి

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లోని 19 కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 78,030 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 35,860 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.93 కోట్ల ఆదాయం వచ్చింది. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన వారికి 2 గంటల్లో దర్శనమవుతోంది

నేటి నుంచి నెల్లూరుకు విద్యుత్ బస్సులు

తిరుపతి అర్బన్ : తిరుమల-నెల్లూరుకు గురువారం నుంచి 12 విద్యుత్ బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ అధికారులు బుధవారం వెల్లడించారు. జిల్లాకు తొలిదశలో 100 విద్యుత్ బస్సులు మంజూరైన విషయం విధితమే. అందులో 50 బస్సులు తిరుపతి-తిరుమల మధ్య రాకపోకలు సాగిస్తున్నాయి. 14 బస్సులు తిరుమల-రేణిగుంట ఎయిర్‌పోర్టుకు, మరో 12 తిరుమల-కడపకు నడుస్తున్నాయి. తాజాగా 12 బస్సులను తిరుమల-నెల్లూరుకు కేటాయించారు. దీంతో మొత్తం 88 విద్యుత్ బస్సులు ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చాయి.

చెంగాళమ్మ తిరునాళ్లలో నేడు బలిహరణ

- రేపు సుళ్లు ఉత్సవం



విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించిన అమ్మవారి ఆలయం

సూళ్లూరుపేట: సూళ్లూరుపేటలో వెలసిన శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి బ్రహ్మోత్సవాలు గురువారం రాత్రి బలిహరణ కార్యక్రమంతో ప్రారంభం కానున్నాయి. చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారు కాళంగినది సుళ్లలో స్వయంభువుగా వెలసింది కాబట్టి అమ్మవారి తిరునాళ్లలో మొదటి మూడురోజులు సుళ్ల ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. గురువారం రాత్రి బలిహరణ కార్యక్రమం అనంతరం శుక్రవారం ఉదయాన 7.45 గంటలకు సుడిమానును ప్రతిష్ట కార్యక్రమాన్ని జరుగుతుంది. తరువాత శుక్రవారం సాయంత్రం 4 గంటలకు సుళ్లు ఉత్సవం కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అంతా సిద్ధం చేశారు. అమ్మవారు కాళంగినది సుళ్లలో దొరికిందనే నానుడి ఉన్నప్పటికీ అమ్మవారి విగ్రహం తడ మండలం గొల్లలములువు నుంచి తీసుకొచ్చి ఇక్కడ స్థాపించారనే కథనం కూడా ప్రచారంలో ఉండడంతో గొల్లలములువులోని తన పుట్టింటి వారు అయిన వేనాటి కుమారస్వామిరెడ్డి (పడమటింటివారు) ఇంటినుంచి వడిబాలు సారెను అట్టహాసంగా తీసుకొస్తారు. అలా అమ్మవారి పుట్టింటినుంచి వచ్చిన వడిబాలు సారె ఆలయంలో సమర్పించిన తరువాత సుళ్ల ఉత్సవం ప్రారంభమవుతుంది. చెంగాళమ్మ తిరునాళ్లలో సుళ్ల ఉత్సవానికి ప్రత్యేకత ఉంది కాబట్టి భక్తులు తండోపతండాలుగా వచ్చి ఉత్సవాన్ని తిలకిస్తారు. స్థానిక ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఈఓ శ్రీనివాసులురెడ్డి, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి తదితరులు ఉత్సవాల కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు.

బ్రహ్మోత్సవాలకు భూరి విరాళదాతల

బ్రహ్మోత్సవాలకు రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి-ప్రశాంతిరెడ్డి, నిప్పో అధినేత పాట్టిపాటి ద్వారకానాథ్‌రెడ్డి, శ్రీసిటీ అధినేత డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, సింగన ఓబుల్‌రెడ్డి, అరవిందో ఫార్మా అధినేత మెట్టు మదన్‌మోహన్‌రెడ్డి, జీవీఆర్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత కొండేపాటి గంగాప్రసాద్, ఎంఎంఎం ఆంజనేయవర్మ, హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ దువ్వూరు రాజగోపాల్‌రెడ్డి-డాక్టర్ కవిత, నెల్లూరు చీర్ల చిన్నారెడ్డి-కవిత, తారకేశ్వర టెక్స్‌టైల్స్, ఎంపీపీ అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, మాంబట్టు అపాచి పుట్‌వేర్ ఇండియా లిమిటెడ్, గోపాల బృందావనం, పెమ్మారెడ్డి మునికృష్ణారెడ్డి విరాళదాతలుగా వ్యవహరిస్తున్నారు.

నేటి సాంస్కృతిక కార్యక్రమాలు

గురువారం సాయంత్రం 7 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. మొదటిరోజు చెంగాళమ్మ పరమేశ్వరి దేవీ చరిత్రను టీటీడీ కళాకారులచే సత్యరూపం, సినీ హీరోయిన్ సురభి విచ్చేయనున్నారు. సంగీత విభావరిలో భాగంగా రేణుకుమార్, ఫోక్ సింగర్ రమణ, కళాంజలి ఆర్కెస్ట్రా, హాస్యవల్లరిలో భాగంగా జబర్దస్త్ సునామీ సుధాకర్ బృందంచే స్కిట్స్, కొరియోగ్రాఫర్ అభిమాస్టర్ బృందంచే నృత్య ప్రదర్శనలు నిర్వహించనున్నారు. ముంగరేషారెడ్డి-అమరావతి, కే జగన్, మదన్, జగన్ ఎంటర్‌ప్రైజెస్, వేనాటి ధనంజయరెడ్డి-సురేఖ, నాయుడు పేట వరలక్ష్మీ రైస్ మిల్ వారు ఉభయకర్తలుగా వ్యవహరించనున్నారు.

పీఠాధిపతికి 'చిన్న మర్యాద'



మహాద్వారం వద్ద విద్యాప్రసన్న తీర్థ స్వామీజీతో టీటీడీ అధికారులు

తిరుమల : కుక్కే సుబ్రహ్మణ్యస్వామి మఠం పీఠాధిపతి విద్యా ప్రసన్న తీర్థ స్వామీజీకి టీటీడీ అధికారులు బుధవారం చిన్నమర్యాద చేశారు. శ్రీవారి ఆలయం వద్ద టీటీడీ అర్చకస్వాములు, అధికారులు ఇస్తికఫాల్ స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. అనంతరం శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



చంద్రగిరిలో వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి తెలిపారు. బుధవారం తిరుపతి రూరల్ మండలం గొల్లపల్లె రైతు భరోసా కేంద్రంలో సబ్సిడీపై వేరుశనగ విత్తనాల పంపిణీని ఆయన ప్రారంభించారు. మోహిత్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వేరుశనగ విత్తనాలు 30 కిలోల బ్యాగు ధర రూ.2,790 కాగా, రూ.1,116 సబ్సిడీ తో రూ.1,674 లకే అందిస్తున్నట్లు స్పష్టం చేశారు. వ్యవసాయం సులభతరంగా మార్చేందుకు ఆధునిక పనిముట్లను కూడా 40 శాతం రాయితీతో అందించినట్లు తెలియజేశారు. సబ్సిడీపై జనుము, జీలుగ విత్తనాలు కూడా అందిస్తున్నామన్నారు. రైతులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని వెల్లడించారు. నియోజకవర్గ పరిధిలో వ్యవసాయ మార్కెట్లలో అన్నదాతకు భోజన వసతి కల్పిస్తుండడం సంతృప్తిగా ఉందన్నారు. అలాగే గేటు రుసుము చెల్లించాల్సిన అవసరం లేకుండా సొంత నిధులు వెచ్చిస్తున్నామని చెప్పారు. ఆర్‌బీకేల ద్వారా ప్రతి రైతు ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని కోరారు. మండలంలో మొత్తం 90 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు పంపిణీ చేసినట్లు వివరించారు. ఈ క్రమంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విడుదల మాధవ రెడ్డి, సర్పంచ్ రవి, ఏఓ సంగన మమత పాల్గొన్నారు. అనంతరం చంద్రగిరిలో 405 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతులన సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు యుగంధర్ రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటరత్నం, సింగిల్ విండో చైర్మన్ చంద్రమౌళి రెడ్డి పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో దుష్ప్రచారం నమ్మొద్దు

తిరుపతి క్రైం: ఆది పురుష్ సినిమాను చూసేందుకు థియేటర్లలో కొందరికి ప్రవేశం లేదంటూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారాన్ని నమ్మొద్దని తిరుపతి జిల్లా పోలీస్ అధికారులు విజ్ఞప్తి చేశారు. ఇది తప్పుడు ప్రచారమని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మృతదేహం వెలికితీత



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ కిరణ్‌కుమార్

గూడూరు రూరల్ : పట్టణ సమీపంలోని నెల్లటూరు వద్ద చెరువులో మంగళవారం సాయంత్రం చేపలు పట్టేందుకు వెళ్లి గల్లంతైన తుపాకుల చిన్నయ్య(90) అనే గిరిజనుడి మృతదేహాన్ని బుధవారం వెలికి తీశారు. మృతుడి కుటుంబానికి ఆర్డీఓ కిరణ్‌కుమార్ రూ.10వేల ఆర్థిక సాయంతోపాటు నిత్యావసర సరుకులను అందజేశారు.

9 మంది ఎర్రదొంగల అరెస్ట్

– 27 దుంగలు.. 5 బైక్‌ల స్వాధీనం

తిరుపతి మంగళం : గూడూరు, కేవీబీపురం ప్రాంతాల్లో ఎర్రచందనం తరలిస్తున్న 9 మంది స్మగ్లర్లను బుధవారం అరెస్ట్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ మురళీధర్ తెలిపారు. నిందితుల నుంచి 27 ఎర్ర దుంగలు, 5 మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. తిరుపతి టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నాయుడుపేట రేంజ్ గూడూరు ఫారెస్ట్ బీట్ పరిధిలో ఆర్‌ఐ చిరంజీవికి చెందిన ఆర్‌ఎస్ నరేష్ బృందం కూంబింగ్ చేపట్టగా 16 ఎర్రచందనం దుంగలు తరలిస్తున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారన్నారు. వారి నుంచి మూడు బైక్‌లు సీజ్ చేసినట్లు చెప్పారు. నిందితులు గూడూరు మండలానికి చెందిన పిగిలం నవీన్ (27), పిగిలం మనోజ్ రావు (30), పాలిచెర్ల బాలాజీ (24), నూర్ బాషా శాకుర్ (27), మావాడూరి శ్రీహరి(28) వెంకటగిరి మండలానికి చెందిన పుట్టా సుబ్రమణ్యం (43)గా గుర్తించామని వివరించారు. అలాగే ఆర్‌ఐ సురేష్ కుమార్‌రెడ్డికి చెందిన ఆర్‌ఎస్‌ఐ విశ్వనాథ్ టీమ్ పుత్తూరు రేంజ్ కేవీబీపురం మండలం వగత్తూరు ఫారెస్టు బీటు పరిధి మారప్పగారి కండ్రిగ గ్రామంలోని అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహించారన్నారు. రెండు మోటారు సైకిళ్లపై 11 ఎర్రచందనం దుంగలను తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. నిందితులు పిచ్చాటూరు మండలానికి చెందిన వి. అజిత్ (26), నాగలాపురం మండలానికి చెందిన కె. రమేష్ (44), తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లా పొన్నేరి తాలూకాకు చెందిన ఎం. హరిదాస్ (41)గా గుర్తించామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని, సీఐ బాలకృష్ణ దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.



స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం, బైక్‌లతోపాటు నిందితుల అరెస్ట్ చూపుతున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

ఎర్రస్మగ్లర్లుగా జనసైనికులు!

ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తూ పట్టుబడిన వారిలో జనసేన కార్యకర్తలు ఉన్నట్లు తెలిసింది. గూడూరు మండలానికి చెందిన పిగిలం మనోజ్ రావు, పిగిలం నవీన్ జనసైనికులని వెల్లడవుతోంది. వారి బైక్‌పై పవన్‌కల్యాణ్ ఫొటో కూడా వేసుకున్నట్లు సమాచారం.



పోలీసులకు పట్టుబడిన బైక్‌పై పవన్‌కల్యాణ్ ఫొటో

పలువురు సీఐల బదిలీ

తిరుపతి క్రైం: జిల్లాలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. తిరుపతి ఈస్ట్ సీఐగా పనిచేస్తున్న శివప్రసాద్ రెడ్డి తిరుచానూరుకు, అక్కడ పనిచేస్తున్న సుబ్రహ్మణ్యం రెడ్డి తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న సురేందర్‌నాథ్ రెడ్డి తిరుపతి వీఆర్‌కు బదిలీఅయ్యారు. చంద్రగిరి పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఓబులేసు పాకాల పోలీస్ స్టేషన్‌కు బదిలీ కాగా అక్కడ పనిచేస్తున్న రాజశేఖర్ చంద్రగిరికి బదిలీ అయ్యారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,870
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,556

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.74,100
రిటైల్ వెండి గ్రాము	రూ.76.10

పట్టుదలతో లక్ష్య సాధన

- అచీవర్స్ మీట్‌లో జేసీ బాలాజీ

తిరుపతి ఎడ్యుకేషన్ : సాధించాలన్న పట్టుదల, అందుకు అవసరమైన కృషి ఉంటే ఏదైనా సాధించవచ్చని జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. తిరుపతి ఎమ్మార్‌పల్లి సర్కిల్‌లోని కౌటిల్య విద్యా సంస్థ విద్యార్థులు క్యాట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించి దేశంలోని ప్రతిష్టాత్మకమైన వివిధ ఐఐఎంలో సీట్లు సాధించారు. ఈ నేపథ్యంలో నేపథ్యంలో బుధవారం సాయంత్రం ఆ సంస్థలో నిర్వహించిన అచీవర్స్ మీట్‌కు ముఖ్య అతిథిగా జేసీ పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు.

జీవితం అపారమైన అవకాశాలను ఇస్తుందని, సానుకూల దృక్పథం కలిగి ఉంటే ఆ అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నతంగా రాణించవచ్చని తెలిపారు. కర్ణాటకలోని ఓ గ్రామంలో జన్మించిన తాను చిన్న తనం నుంచే చదువుతో పాటు జీకేపై దృష్టి సారించానన్నారు. ప్రతిరోజు పాఠ్యపుస్తకాలతో పాటు దినపత్రికలు, మ్యాగజైన్లు చదవడం, క్విజ్ షోలు చూసేవాడినన్నారు. కళాశాల స్థాయి వచ్చే వరకు తనకు ఇంగ్లీష్ భాషపై పట్టు లేదన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ

సాధించాలన్న తపన, అందుకు క్రమశిక్షణతో చేసిన ప్రయత్నమే ఐఏఎస్ సాధించగలిగానని, ప్రతి ఒకరూ లక్ష్యాన్ని ఏర్పరుచుకుని లక్ష్యసాధనకు నిరంతరం కృషి చేయాలన్నారు. అనంతరం ఐఐఎంలో సీట్లు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్వీయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్‌వీఎస్ సత్యనారాయణ, కౌటిల్య డైరెక్టర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

స్పేస్ ఒలింపియాడ్‌లో ఎలెన్ విద్యార్థి ప్రతిభ

తిరుపతి ఎడ్యుకేషన్ : నాసా నిర్వహించే ప్రతిష్టాత్మక ఇంటర్నేషనల్ స్పేస్ ఒలింపియాడ్ పరీక్షలో తిరుపతిలోని ఎలెన్ కెరియర్ ఇన్‌స్టిట్యూట్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థి నిమై కర్మ్యాకర్ ప్రిలిమినరీ లెవెల్‌లో ఉత్తీర్ణుడై ఇంటర్మీడియట్ లెవెల్‌కి అర్హత సాధించినట్లు ఆ సంస్థ తిరుపతి హెడ్ డాక్టర్ ఫణి తెలిపారు. మూడు దశల్లో జరిగే ఈ పరీక్ష ప్రిలిమినరీ లెవెల్ మే 13, 14వ తేదీల్లో నిర్వహించినట్లు తెలిపారు. మన రాష్ట్రంలో అర్హత సాధించిన కొంత మందిలో నిమై ఒకడని తెలిపారు. నిమై ఎనిమిదో తరగతి నుంచి తిరుపతి ఎలెన్ కెరియర్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఒలంపియాడ్ ప్రోగ్రామ్ వివరాలకు 99000 70050లో, అలాగే తిరుపతి ఏఐఆర్ బైపాస్ రోడ్డులోని తమ సంస్థను సంప్రదించాలని తెలిపారు.



విద్యార్థిని అభినందిస్తున్న డాక్టర్ ఫణి



శ్రీవారిని సేవలో ప్రముఖులు



హీరోయిన్ కృతి సనన్, ఎంపీ గురుమూర్తి



ఎంపీ రెడ్డెప్ప



ఎంపీసంజీవ్ కుమార్



అపోలో చైర్మన్ ప్రతాప్ సి. రెడ్డి

తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు సేవించుకున్నారు. వారిలో సినీ నటి ఆమని, హీరోయిన్ కృతీసనన్, ఎంపీలు గురుమూర్తి, రెడ్డెప్ప, సంజీవ్ కుమార్, అపోలో చైర్మన్ ప్రతాప్ సి.రెడ్డి ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

- తిరుమల

వాహనం ఢీకొని జింక మృతి

నాయుడుపేటటౌన్ : మండలంలోని నరసారెడ్డికండ్రిగ వద్ద జాతీయ రహదారిపై బుధవారం ఉదయం గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ జింక మృతి చెందింది. స్థానికుల కథనం మేరకు.. గ్రామ సమీపంలో మూడు జింకలు పరుగుల తీస్తూ హైవే పైకి చేరుకున్నాయి. రోడ్డు దాటుతుండగా వాహనం ఢీకొనడంతో ఒక జింక అక్కడికక్కడే మరణించింది. సమాచారం అందుకున్న ఫారెస్టు రేంజర్ వి.భాస్కర్ రెడ్డి, డిప్యూటీ రేంజర్ ఎం.కోటేశ్వరరావు, ఎఫ్‌బీఓ మునెయ్య ఘటనాస్థలానికి చేరుకున్నారు. జింక కళేబరాన్ని పశువైద్యశాలలో పోస్టుమార్టం చేయించారు. సమీప అటవీ ప్రాంతంలో ఖననం చేశారు.

యువకుడి హత్య



మణి మృతదేహం

తిరుపతి క్రైం : నగరంలోని అన్నమయ్య సర్కిల్ సమీపంలో ఉన్న హథీరాంజీ కాలనీలో బుధవారం సాయంత్రం ఓ యువకుడు హత్యకు గురయ్యాడు. వివరాలు.. తిరుపతి మంగళంలో నివసిస్తున్న మణి(25), ప్రవీణ్, కన్నయ్య, భార్గవ్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరంతా కూడా అన్నమయ్య సర్కిల్‌లో ఆటోస్టాండ్‌కు చెందినవారు. అదే ప్రాంతంలో మద్యం సేవించారు. మత్తులో మద్యం సీసా విసరడంతో అదే సమయంలో అటుగా వెళుతున్న స్థానిక హనీ మెస్ యజమాని కుమార్, అతని భార్య అనురాధపై పడింది. దీనిపై ప్రశ్నించడంతో అనురాధను వారు దుర్భాషలాడారు. అంతటితో ఆగకుండా ఆమె భర్త కుమార్‌పై నలుగురూ మూకుమ్మడిగా దాడి చేశారు. ఇది గమనించిన కుమార్ హోటల్‌లో పనిచేసే సురేష్ కర్రతో యువకులపై తిరగబడ్డాడు. ఈ ఘర్షణలో మణి తలకు తీవ్రంగా గాయమైంది. స్థానికులు రుయా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మణి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

భాకరాపేట : భాకరాపేట ఘాట్ రోడ్డులో బుధవారం జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలు.. రొంపిచెర్ల మండలం బలిజవీధికి చెందిన సూరిశెట్టి లక్ష్మీనారాయణ (26) తిరుపతికి వెళ్లి తిరుగు ప్రయాణంలో ద్విచక్ర వాహనంపై వస్తుండగా లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మరణించాడు. భాకరాపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీసిటీలో సంతృప్తికరంగా వసతులు



శ్రీసిటీలో నమూనాలను పరిశీలిస్తున్న సవార్ ధనానియా

వరదయ్యపాళెం: శ్రీసిటీలో సంతృప్తికంగా వసతులు ఉన్నాయని రబ్బర్ బోర్డు చైర్మన్ డాక్టర్ సవార్ ధనానియా ప్రశంసించారు. బుధవారం ఆయన శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ ఉపాధ్యక్షుడు (కస్టమర్స్ రిలేషన్స్) సి.రమేష్ కుమార్ స్వాగతం పలికి శ్రీసిటీలో మౌలిక సదుపాయాలు, ప్రగతి, ప్రత్యేకతలను వివరించారు. స్థానిక సెంట్రల్ ఎక్స్‌ప్రెస్ రహదారిపై జ్ఞాన్ సర్కిల్ సమీపంలోని ఇండియన్ రబ్బర్ మాన్యుఫ్యాక్చరర్స్ రీసెర్చ్ అసోసియేషన్ (ఐఆర్‌ఎంఆర్‌ఏ) గుర్తింపు పొందిన స్వతంత్ర్య ప్రయోగశాలను సవర్ ధనానియా తనిఖీ చేశారు. రబ్బరు ఉత్పత్తుల నాణ్యత పరీక్షలు విశ్లేషణ తదితర సేవల గురించి ఆరా తీశారు. ఈ పర్యటనలో ఆయన శ్రీసిటీ పరిసరాలు, పారిశ్రామిక కార్యకలాపాలను పరిశీలించారు. ప్రపంచ స్థాయి సదుపాయాలతో మెగా ఇండస్ట్రియల్ పార్కును అభివృద్ధి చేసినందుకు శ్రీసిటీ యాజమాన్యాన్ని అభినందించారు. ఆయన వెంట ఐఆర్‌ఎంఆర్‌ఏకు చెందిన డాక్టర్ రాంకుమార్, పాల్ వన్నన్ ఉన్నారు.

వేసవిలో వన్యప్రాణులకు అండగా..



బొమ్మసముద్రంలో నీటి కుంటల్లో నింపుతున్న నీరు

- దాహార్తి తీర్చేలా అటవీశాఖ ప్రత్యేక చర్యలు
- నీటి తొట్టెలు చెక్‌డ్యామ్‌ల ఏర్పాటు

చిత్తూరు కార్పొరేషన్: అడవికి అందాలు వన్యప్రాణులే వాటిని సంరక్షించే బాధ్యత అందరిపై ఉంది. వేసవి వచ్చిందంటే చాలు నీరు, ఆహారం లభించక వన్యప్రాణులు జనారణ్యంలోకి రావడం, మృత్యువాత పడడం, అడవుల్లో అగ్ని మంటల్లో చిక్కడం లాంటి కారణాలతో అంతరించిపోయే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో వన్యప్రాణుల రక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అటవీశాఖ ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. వన్యప్రాణుల దాహం తీర్చడంతోపాటు అడవుల సంరక్షణకు విశేష కృషి చేస్తోంది.

దాహార్తి తీర్చడం ఇలా..

అడవుల్లో ఫైర్‌లైన్ ఏర్పాటు చేసి వృక్ష, జంతువులకు రక్షణ కల్పిస్తున్నారు. వన్యప్రాణుల సౌకర్యార్థం అదనంగా చెక్‌డ్యామ్‌లు, ఫారంపాండ్లు, సాసర్‌రింగ్స్ లాంటివి ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో ట్యాంకర్ల ద్వారా నీటిని నింపుతూ వన్యప్రాణుల గొంతుతడుపుతున్నారు. కంపా నిధుల ద్వారా అడవుల సంరక్షణకు అటవీశాఖ తీసుకుంటున్న పనులు సత్ఫలితాలనిస్తున్నాయి. జిల్లాలోని 1.95 లక్షల హెక్టార్లలో అడవులు విస్తరించి ఉన్నాయి. జిల్లాలోని 6 ఫారెస్ట్ రేంజ్‌ల పరిధిలోని 24 సెక్షన్లు, 84 బీట్ల పరిధిలో దాదాపు 40 నీటి తొట్టెలు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా వన్యప్రాణులకు సమృద్ధిగా తాగునీరందిస్తున్నారు. వీటితో పాటు 120 చెక్‌డ్యామ్‌లకు, 294 నీటి కుంటల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు చెబుతున్నారు. అగ్ని ప్రమాదాల నివారణకు రూ.81 లక్షలు నిధులు మంజూరు చేయగా అందులో రూ.41 లక్షలు ఖర్చు చేశారు. అడవుల ప్రాముఖ్యతపై ప్రతి ఒకరిలోను అవగాహన అవసరం. వేసవిలో కార్చిచ్చుబారిన పడి అటవీ సంపద బుగ్గిపాలవుతోంది. ఈ క్రమంలోనే సమీపాన ఉన్న ప్రజలకు అడవుల సంరక్షణ, ప్రాముఖ్యతపై అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. కాపరులను కేవలం పశువుల మేతకు మాత్రమే అనుమతిస్తున్నారు. ఇతరులను అడవుల్లోకి వెళ్లనీకుండా అడ్డుకుంటున్నారు. అటవీ సంపద మంటలపాలు కాకుండా ఫైర్‌లైన్ల నిర్వహణపై దృష్టి పెట్టారు. అడవుల్లో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే శాటిలైట్ ద్వారా వచ్చే మెసేజ్ అలర్ట్‌తో ఆ ప్రాంతానికి చేరుకుని మంటను నివారించేలా 46 కిలోమీటర్ల ఫైర్‌లైన్లను అందుబాటులో ఉంచారు. జిల్లాలోని ఫారెస్ట్ ప్రాంతాల్లో వన్యప్రాణులు స్వేచ్ఛగా సంచరిస్తున్నాయి. దుప్పులు, కుందేళ్లు, అడవిపందులు, జింకలు, నెమళ్లు, పక్షులు ఎక్కువగా ఉన్నాయి. జగనన్న పచ్చతోరణంలో భాగంగా జంతువులు, పక్షుల కోసం ఎక్కువగా నేరేడు, ఉసిరి, మారేడు, వెలగ, చింత, వేర, రావి, మర్రివంటి పండ్ల మొక్కలను నాటి సంరక్షిస్తున్నారు. మరిన్ని ప్రాంతాల్లో ఎర్రమద్ది, నల్లమద్ది వంటి విత్తనాలను సేకరించే పనిలో అధికారులు ఉన్నారు.

బాధ్యత అందరిది



అడవిలోని వన్యప్రాణుల సంరక్షణ బాధ్యత అందరిది. అడవుల విస్తరణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. పలు రకాల మొక్కలను పెంచడానికి కృషి చేస్తున్నాం. అడవులు, వన్యప్రాణులకు ముప్పు కల్గిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. జంతువులను వేటాడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. - చైతన్యకుమార్‌రెడ్డి, డీఎఫ్‌ఓ

జాతీయస్థాయి పోటీలకు 19 నాటికలు



మాట్లాడుతున్న బీఎన్ రెడ్డి

తిరుపతి కల్చరల్ : తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో జూలై 23 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి నాటక పోటీలకు 8 పౌరాణికం, 11 సాంఘిక నాటికలను ఎంపిక చేసినట్లు అభినయ ఆర్ట్స్ వ్యవస్థాపక కార్యదర్శి బీఎన్ రెడ్డి తెలిపారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. జాతీయ నాటక, నృత్య పోటీల కోసం గత 26 రోజులుగా సుమారు 105 పౌరాణిక, సాంఘిక నాటక ప్రదర్శనలను తిలకించామన్నారు. అందులో ఉత్తమ నాటికలనే పోటీలకు ఎంపిక చేసినట్లు వెల్లడించారు. అందులో శ్రీమాధవ వర్మ, విజయా నిరుద్ధం, శ్రీకృష్ణార్జునీయం, మహావీర ధనంజయ, నర్తనశాల, శ్రీస్వామి అయ్యప్ప, వసంత రాజీయం, తిరుపతి గంగమ్మ పౌరాణిక పద్య నాటకాలు ఉన్నాయని వివరించారు. అలాగే స్థిరాస్తి, మృత్యుంజయుడు, నాన్ననే నొచ్చేస్తా, శ్రీకారం, నేరస్తులు, మోచేతి కంకణాలు, ది లెసన్, స్వర్ణ కమలాలు, మనసున మనసై, ఎడారిలో వాన చినుకు, రైతే రాజు సాంఘిక నాటికలను ఎంపిక చేసినట్లు చెప్పారు. ఈ క్రమంలోనే 275 శాస్త్రీయ నృత్యాలతో పాటు జానపద బృంద నృత్య ప్రదర్శనలకు అవకాశం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. 12 ఏళ్ల పైబడిన వారికి సోలో పోటీలు కూడా ఉంటాయన్నారు. ఇందుకు సంబంధించి ఆసక్తిగల కళాకారులు ఈనెల 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9581154667 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. సమావేశంలో అభినయ ఆర్ట్స్ గౌరవాధ్యక్షుడు ఎస్.విశ్వనాథరెడ్డి, అధ్యక్షుడు మబ్బు సూర్యనారాయణరెడ్డి, భాస్కర్‌రెడ్డి, పీఆర్ నాయుడు పాల్గొన్నారు.

